# హరిశ్చంద్రుడి ఆత్మ

మనకు ఆదర్శనీయుడైన పౌరాణిక చక్రవర్తి సత్యారాధన మానివేసి సత్యాన్వేషణ సాగించబోతున్నట్టు నిరూపించే ఒక హాస్యపూరితమైన చిత్రసమస్య

సత్యంకోసం సకలకష్టాలూ పడి, తద్వారా తన ఖ్యాతి ప్రపంచమంతా చాటి, శాశ్వతంగా "సత్య హరిశ్చంద్రు"డనే పేరు సంపాదించుకున్న హరిశ్చంద్ర చక్రవర్తి తన అవతారం చాలించిన తరవాత ఆయనగారి ఆత్మ నేరుగా బ్రహ్మ లోకానికి వెళ్ళాడు. బ్రహ్మ ఆదిలో సత్యాన్ని వేదరూపంగా తననోట ఉచ్చరించినవాడు కనక హరిశ్చంద్రుడి ఆత్మ బ్రహ్మలోకంలో ఉండేటట్టు ఏర్పాటు జరిగింది.

బ్రహ్మలోకవాసులైన ఋష్యాదులు హరిశ్చంద్రుడి ఆత్మకు బ్రహ్మాండమైన స్వాగతం ఇచ్చారు. ఆ సందర్భంలో ఒక స్వాగత పత్రం కూడా చదవబడింది. అందులో గమనించదగిన ముక్కలు ఈ కింద ఇస్తున్నాను:

"...హే సత్యప్రియా, నీ రాకవల్ల మా లోకం పావనమయింది ... నీ సమక్షాన మే మారాధించే సత్యం దాదాపూ అనృత మనుపించుతున్నది—దివిటీ వెలుగున దీపం కాంతి హీనంగా కనిపించినట్టు!... నీయందు మాకున్న వాత్సల్య గౌరవాలు ప్రకటించటానికి ఈ లోకాన్ని ఇక ముందునుంచీ సత్యలోకమని పిలుస్తాం..."

ఈ స్వాగతపత్రంతో హరిశ్చంద్రుడి తల తిరగలేదు. భూలోకంలో ఆయన ఇంతకు వెయ్యింతల పొగడ్తకు అలవాటు పడిపోవటంవల్ల, ఆయన తల తిరిగేదేమిటో అదివరకే తిరిగింది. ఇక తిరగటాని కెక్కడా అవకాశం లేదు. పొగడ్తను వినయంతో స్వీకరించటానికి కూడా కొంత అభ్యాసం ఉండాలి. ఆ అభ్యాసం హరిశ్చంద్రుడికి తగినంతగా ఉండింది కనక ఇప్పుడాయన ఋష్యాదులు సమర్పించుకున్న స్వాగతపత్రాన్ని చక్కని, తూచిన వినయంతో స్వీకరించాడు.

హరిశ్చంద్రుడి రాకతో సత్యలోకం చాలా బాగుపడ్డదని చెప్పాలి. వెనకటి మాదిరిగా ఋష్యాదు లిప్పుడు ఒకరితో ఒకరు పరాచకాలాడటం మానేశారు. హాస్యమూ, కోపమూ, విచారమూ మొదలైన ఉద్రేకాలు అసత్యానికి మంచి ఎరువు. సత్యం ఉద్రేకరహితమైనది. నిరపాయమైన ఉద్రేకాలు కూడా సత్యానికి హానికలిగించుతై. అందుచేత ఋష్యాదులిప్పుడు టోటల్‌గా ఉద్రేకరహితమైన జీవితం గడుపుతూ అతి గాంభీర్యంతో ప్రవర్తించుతున్నారు.

ఈ విధంగా కొన్నివేల సంవత్సరాలు గడిచింది. ఈలోపుగా హరిశ్చంద్రుడి ఆత్మకు అనేక మార్పులు జరుగుతూ ఉన్నై. ఆయనకు సత్యలోక జీవితం రుచించటంలేదు. ఆయన ఆత్మ ముఖ్యంగా చంద్రమతీ లోహితాస్యుల కోసం తపించుచున్నది. అందులోనూ ముఖ్యంగా చంద్రమతి !

పాపం, చంద్రమతి, ఏ గోలోకంలోనో ఉంది. ఎంత సాధువు! ఎటువంటి భార్య! ఎన్ని కష్టాలు పడ్డది! తన సత్యప్రియత్వాన్ని ఎట్లా అర్థం చేసుకుంది! ఆమె జ్ఞాపకం రాగానే హరిశ్చంద్రుడికి దుఃఖం పొంగి వచ్చింది. వెనక ఆమెను తను కాల కౌశికుడికి విక్రయించినప్పటి దృశ్యాలు జ్ఞాపకం వచ్చినై. అప్పటికి నిజంగా తనకు సరిగా తెలియదు—చంద్రమతినీ, లోహితాస్యుణ్ణీ విడిచి ఉండటమంటే ఏమిటో. కనుకనే తను సాహసించి అంతపని చెయ్యగలిగాడు. ఆ విశ్వనాథుడి దయవల్ల తన కష్టాలు గట్టెక్కి తనకు చంద్రమతీ లోహితులు తిరిగి లంభించింది, తిరిగి తను వారిని శాశ్వతంగా పోగొట్టుకొనే టందుకా? ఎంత అన్యాయం?

తను సత్య ప్రియుడైతే కావచ్చు. కాని తనకు కావలసినవి ఇంకా ఉన్నై. అవేవీ ఈ సత్యలోకంలో లేవు. తను ఇంకా ఇక్కడ ఇట్లా ఎంతకాలం ఉండాలి?

ఒకనాడు నారద మహాముని కనిపించినప్పుడు హరిశ్చంద్రుడు ఆయన శరణుజొచ్చి తన మానసికస్థితి కాస్తా చెప్పుకున్నాడు.

నారదులవారు అంతా విని నవ్వునవ్వి తల పంకించి "పిచ్చివాడా, ఇట్లా ఎంతకాలం నించీ బాధపడుతున్నావు?" అన్నారు.

"చాలా కాలంనించీ."

"నీకు కావాలసినప్పుడల్లా నీ భార్యా పుత్రులను చూసి రావచ్చునే! నీకేమిటి అడ్డం?"

హరిశ్చంద్రుడు ఒక్క గంతువేసి గోలోకానికి పరిగెత్తాడు. అక్కడ ఒక చక్కని పచ్చికబయలుమీద, తన మాదిరిగానే నోరులేని సాధుజంతువులైన గోవులమధ్య చంద్రమతి పరధ్యానంగా కూర్చుని ఉంది.

హరిశ్చంద్రుడు భార్యను చూడగానే ఒక్క కేక పెట్టి అమాంతం ఆమెను కావిలించు కున్నాడు. భర్తను చూడగానే చంద్రమతి ముఖం వికసించిన పద్మం అయింది. ఇద్దరూ ఆనందం పట్టలేక ఏడుస్తున్నారు.

"నేనిక మిమ్మల్ని చూసే ఆశకూడా వదులుకున్నాను. ఇంతకాలమూ వీరే నా అను చరులు. వీరి స్నేహం కూడా తీరిపోతున్నది. నే నిక భూలోకానికి తిరిగిపోవాలి!" అంటూ చంద్రమతి తమవంక విశాలమైన అమాయకపు కళ్ళతో చూసే ఆవుల్ని చూపింది.

హరిశ్చంద్రుడు కంగారుతో, "ఏమిటీ? ఏమిటీ?" అన్నాడు. తనకు మళ్ళీ భూమిమీద పునర్జన్మ సంప్రాప్త మవుతున్నదని చంద్రమతి భర్తకు తెలియజేసింది.

"మరి నేను?" అన్నాడు హరిశ్చంద్రుడు

"మీరిప్పు డెక్కడ? మీకు మళ్ళీ జన్మ సంప్రాప్త మయ్యేలోపల నేనెన్ని జన్మలెత్తాలో!"

"నన్ను రాకుండా—" హరిశ్చంద్రుడు పైన అనలేకపోయినాడు.

"నేనేం చెయ్యను?" అన్నది చంద్రమతి హరిశ్చంద్రుడి మొహం నిమురుతూ.

"నేను పునర్జన్మ ఎత్తేవరకు ఆగలేవా? నీ పాతివ్రత్య మహిమ అందుకు చాలదా?" అన్నాడు హరిశ్చంద్రుడు.

"ఏ మహిమకూడా విధిని ఏమీ చెయ్యలేదు. మనిద్దరి హృదయాలు ఒకటికాని, కర్మ పరిపాకం ఒకటికాదు. కర్మను సమంగా పంచుకునే యోగ్యత ఉంటే నేను మీతోపాటు సత్య లోకంలోనే ఉండేదాన్ని!"

హరిశ్చంద్రుడి హృదయంలో ఒక క్షణంపాటు విప్లవం రేగింది. ఇది అన్యాయం, దౌర్జన్యం! విధి ఆత్మల కింత తారతమ్యం కల్పించటం—

ఆ ధోరణిలో ఇంకా ఆలోచించినట్టయితే ఆయనలోనించి ఒక సామ్యవాద సిద్ధాంతం పుట్టి ఉండును. కాని ఉత్తమ లోకవాసులకు సామ్యవాదం అలవడదు. అక్కడ స్వార్థానికే ఎక్కువ చలామణీ.

హరిశ్చంద్రుడు మళ్ళీ సత్యలోకానికి వచ్చి నారదులవారిని దర్శించాడు.

"స్వామీ! నేనిక్కడ ఇంకా ఎంతకాలం ఉండాలి?"

"భూలోకంలో నీ ఖ్యాతి ఎంతకాలం ఉంటుందో అంత కాలమూ నువ్విక్కడ ఉండవచ్చును."

"అదెట్లా తెలుస్తుంది?"

"పో! కలికాలంలోకి వెళ్ళిరా! నీ ఆత్మ దేశకాలాలకు అతీతమైనది"

హరిశ్చంద్రుడి ఆత్మ మరుక్షణమే కలికాలానికి వచ్చి వాలింది. అంతటా కలయ తిరిగింది. చెప్పుకుంటున్నారు!— తన పేరంతటా చెప్పుకుంటున్నారు. అంత ఆరాటంలో కూడా ఆనందం కలిగింది హరిశ్చంద్రుడికి.

కలికాలంలో ఇంకో వెయ్యి సంవత్సరాలు ముందుకువెళ్ళి చూశాడు హరిశ్చంద్రుడు. ఇంకా చెప్పుకుంటున్నారు!

మరో వెయ్యి సంవత్సరాల తరవాత కూడా చెప్పుకుంటూనే ఉన్నారు.

ఒక్కసారిగా నాలుగువేల సంవత్సరాలు ముందుకువెళ్ళి చూశాడు హరిశ్చంద్రుడు. దిగ్భ్రమ కలిగింది. అంతటా తన పేరే. తన పేర నాటకాలు! హరికథలు! సినిమాలు! పోస్టర్లు! ఏ గోడమీద చూసినా తనబొమ్మే—తనమాదిరిగా మాత్రం లేదు.

"ఎంత సత్యప్రియులు! ఇదా కలికాలం?" అనుకున్నాడు హరిశ్చంద్రుడు.

ఈ కలికాలపు జీవితం ఏమిటో చూడాలనిపించింది హరిశ్చంద్రుడికి. అగోచరుడు కనక ప్రపంచం యావత్తూ తిరిగాడు. ఆయనకు కలిమహాత్యం తెలిసిపోయింది.

తను పొరపాటు పడ్డాడు. వీ రెవరూ సత్యప్రియులు కారు. అంతా అసత్యప్రియులే. ఇదంతా వట్టి కపటనాటకం. పత్రికలలో ప్రకటనల లగాయతు పార్లమెంటు చర్చలవరకూ ప్రతిదీ సర్వాబద్ధం—అంతా వంచన.

ఈ అసత్యప్రియత్వం చూస్తున్నకొద్దీ ఆయన ఆత్మ విశ్వాసం కొంచెంకొంచెమే తిరిగి రాసాగింది. ఈ ప్రపంచం తనకు వద్దు. తన ఆరాటం ఉపశమిస్తుంది. ఈ కలిజీవితం ఇంకా కొంతచూసి తన ఆరాటం సాంతంగా పోగొట్టుకుని సత్యలోకానికి పోదామని హరిశ్చంద్రుడు అక్కడా అక్కడా తిరగసాగాడు.

ఒక విచిత్రమైన గదిలో గాజుబుడ్లూ అదీ పెట్టుకుని ఒక వృద్ధుడు ఏదో చేస్తున్నాడు. ఆయన్ను చూడగానే "ఇత నెవరో సత్యాన్వేషి!" అనిపించింది హరిశ్చంద్రుడికి. తన కన్న ఈ ముసలాడే గొప్పవాడనే ఆలోచన హరిశ్చంద్రుణ్ణి బాధించసాగింది. తను సత్యప్రియుడే కాని సత్యాన్వేషి కాడు. తన జీవితంలో తన సత్యప్రియత్వం తన హృదయాన్ని ఛేదించుకు తిన్నది. ఈ ముసలాడికి సత్యాన్వేషణలో బుర్ర తప్ప హృదయం ఏ మాత్రమూ పని చెయ్యటం లేదు. ఎంత అదృష్టవంతుడు.

కాని ఈ ముసలాణ్ణి గురించి తనను చెప్పుకున్నట్టు చెప్పుకోరు. ముసలాడికి ఆయావ కూడా ఉన్నట్టులేదు. ఎంత అన్యాయం? ముసలాడు సత్యలోకంలో ఉన్నట్టూహించుకోవటానికి ప్రయత్నించాడు హరిశ్చంద్రుడు చాత కాలేదు. కలికాలంలో మానవులు అన్యాయం చెయ్యటమేకాక మానవులకు అన్యాయం జరగటంకూడా జాస్తేనేమో!

హరిశ్చంద్రుడు అక్కణ్ణించి బయలుదేరాడు. ఒక తోటలో భార్యాభర్తలిద్దరు మధ్య కుర్రవాణ్ణి కూర్చోబెట్టి సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. కుర్రవాడు తల్లివంక తిరిగినప్పుడు తండ్రీ తండ్రికేసి తిరిగినప్పుడు తల్లీ పిల్లవాడి జడపట్టుకు లాగుతూ పిల్లవాడికి కోపం తెప్పించి "నేను కాదురా, అమ్మ" అనీ, "నేను కాదురా, నాన్న!" అని అబద్ధాలాడుకుంటు న్నారు. పొంగిపోతున్న హృదయంతో హరిశ్చంద్రుడీ ఆట చూస్తున్నాడు.

వీరికి సత్యలోకంలో స్థానంలేదు! కాని వారిని చూస్తున్నంతసేపూ, ఆ ఆడుతున్నది తనూ, చంద్రమతి లోహితులూ అనిపిస్తున్నది.

హరిశ్చంద్రుడు సాగి వెళ్ళాడు.

ఒకచోట రోడ్డుమీద ఒక పెద్దమనిషి ఒక నిర్భాగ్యుణ్ణి నిలవేసి, "ఎప్పుడిస్తావోయ్ డబ్బు?" అంటున్నాడు.

"తొందరపెట్టకు బాబూ! ఇంకో నెలలో తప్పకుండా ఇస్తాను. ఉద్యోగం పోయి చస్తున్నాను!" అన్నాడు నిర్భాగ్యుడు.

"ఎట్లా ఇస్తావు నెలలో? ఇన్ని సార్లడించుకోకపోతే ఇవ్వననో, సంవత్సరానికో పది సంవత్సరాలకో ఇస్తాననో చెప్పరాదూ? రేపూ, వారం, నెలా—ఎందుకిట్లా వాయిదాలూ?"

నిర్భాగ్యుడు దీనంగా చూశాడు.

వాడికి సత్యలోకంలో స్థానంలేదు. కాని ఆ నిర్భాగ్యుణ్ణి చూస్తే తనని తాను అద్దంలో చూసుకున్నట్టుంది! తను కూడా నక్షత్రుడికి ఇట్లాగే వాయిదా పెట్టాడు. సమయానికి కాల కౌశికుడు తటస్థపడకపోతే తన గతికూడా ఈ నిర్భాగ్యుడి గతే అయేది !

హరిశ్చంద్రుడు అక్కణ్ణించి సాగాడు. ఒకచోట మతచర్చ జరుగుతున్నది. అంతా పండితులే కాని మత తారతమ్యాలు కలవారు. మత గ్రంథాలు ముందు పెట్టుకొని ఒకే మాటలోనించి విరుద్ధమైన అర్థాలు లాగుతున్నారు. మానవాతీతమైన సత్యాన్ని ప్రకటించే టందుకు మానవ కల్పితమైన భాష చాలదని హరిశ్చంద్రుడు అర్థం చేసుకున్నాడు. అక్కడి నించి సాగి ఆయన నడవసాగాడు.

ఒకచోట ఒకపిల్లవాడు బొమ్మలపుస్తకం తల్లి పక్కనే కూర్చుని తిరగవేస్తున్నాడు. తల్లి ఊలుతో జోళ్ళు అల్లుతున్నది. పిల్లవాడు అకస్మాత్తుగా "అమ్మా! అమ్మా! ఇదుగోనే రెండబ్బాయిలు!" అన్నాడు.

రెండబ్బాయిలు కాదు, నాన్నా! ఇద్దరబ్బాయిలూ!" అన్నది తల్లి నవ్వుతూ.

"రెండబ్బాయిలు" అబద్ధమా, నిజమా? హరిశ్చంద్రుడు ఆశ్చర్యపడ్డాడు.

"ఇదిగో, ఇంకొ బొమ్మ, అమ్మా! కుక్క బొమ్మ" అన్నాడు కుర్రాడు. తల్లి బొమ్మకేసి చూసి "కుక్క కాదు, నాన్నా! తోడేలు" అన్నది.

"కాదు,"

ఈ కుర్రాడికి సత్యలోక ప్రాప్తిలేదు. హరిశ్చంద్రుడి ఆత్మలో చెప్పతరంకాని ఆవేదన పుట్టింది, సత్యలోకంచేరాడు. ఆయన ఎక్కడా ఆగకుండా బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. నారదుడూ, ఇతర ఋషులు అక్కడే ఉన్నారు.

హరిశ్చంద్రుడు అందరికీ నమస్కారం చేసి "నే నిక్కడ ఉండలేను. నాకు శల విప్పించండి!" అన్నాడు.

అందరూ ఆశ్చర్యంతో చూశారు. నారదుడు మాత్రం నవ్వాడు.

"ఏమిటి, హరిశ్చంద్రా?" అన్నారంతా.

"నే నిక సత్యారాధన మానేసి సత్యాన్వేషణకు పోతున్నాను. సత్యాన్వేషణ చెయ్య కుండా సత్యారాధన అసంభవమని తెలుసుకున్నాను. జన్మలో ఎన్నడూ సత్యాన్వేషణ చెయ్యని నాకు 'సత్యప్రియు'డని బిరుదు ఎట్లా వచ్చిందో తెలియకుండా ఉంది!" అన్నాడు హరిశ్చంద్రుడు. అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

ముద్రణ: 3 సెప్టెంబరు ఆదివారం 1939, ప్రజామిత్ర.
(ఈ రచన ప్రజామిత్రకు ప్రత్యేకమని సూచన ఉంది. కొ. కు ను 'యువ' పత్రికా సంపాదకులుగా పరిచయం చేశారు.)